క్లుప్తంగా

అనాథలు, నిరాశ్రయులకు సాంకేతిక విద్యలో ప్రవేశాలు

సిరిసిల్ల: జిల్లాలోని పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అనాథ, నిరాశ్రయులు, నిరుపేద బాలికలకు మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీర్ (డీసీఈ) విభాగంలో (60 సీట్లు), డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్(డీఈఈఈ) భాగంలో (60 సీట్లు), డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (డీసీఎంఈ) విభాగంలో (60 సీట్లు), డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (డీఈసీఈ) విభాగంలో (60 సీట్లు) ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మే 20లోగా కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ ఆఫీస్‌లో దరఖాస్తులు చేయాలని లక్ష్మీరాజం కోరారు.

ప్రతీ రైతుకు ఈ ఫార్మర్ ఐడీ



బొల్లారంలో రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతీ రైతుకు ఈ ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు వేములవాడ రూరల్ ఏవో వినీత అన్నారు. మండలంలోని బొల్లారం, ఫాజుల్‌నగర్, వెంకటాంపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి రైతు విశిష్ట నమోదు చేశారు. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 14 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్) ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందేందుకు మీ ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నెంబర్ తీసుకొని సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నర్సయ్య

ఇల్లంతకుంట: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికను గ్రామ సభల ద్వారానే జరగాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గన్నేరం నర్సయ్య అన్నారు. సోమవారం ఇల్లంతకుంట ఎంపీడీవో శశికళకు వినతిపత్రం అందించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మల్కపేట కుడి కాలువ వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ కుడి కాలువ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్షీరాభిషేకం చేశారు. మల్కపేట ప్రాజెక్ట్ మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే పూర్తయిందని, నీటి విడుదల చేసిన సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించామన్నారు. మల్కపేట చెరువులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని, లేకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి నష్టపరిహారం అందిస్తామన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు సిద్దంశెట్టి శ్రీనివాస్, ఆరె మహేందర్, ఉత్తెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ఎల్లారెడ్డిపేట: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని రాణించాలని అధ్యాపకులు కోరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నారాయణపూర్, గజసింగవరంలో విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని కోరుతూ.. ప్రచారం చేశారు. అధ్యాపకులు పర్శరాములు, ఖ్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తంగళ్లపల్లి: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం మండలంలోని గోపాలరావుపల్లెలో కళాజాత నిర్వహించారు. వేసవి నేపథ్యంలో ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు రావాలని సూచించారు.ప్రభుత్వ పథకాలపై పాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ గడ్డం శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులను భారత్ నుంచి పంపాలి



వేములవాడ అర్బన్ : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



చందుర్తి : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. భారత్‌లో ఉన్న పాకిస్తానీయులను భారత్‌నుంచి తరిమివేయాలని కోరామన్నారు. రాష్ట్ర నాయకులు లింగపల్లి శంకర్, వెంకటేశ్వరరావు, రాజిరెడ్డి, లక్ష్మణ్, శంకర్, రాజు, సంజీవ్‌రెడ్డి, పవన్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

చందుర్తి: పహల్గాం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ దేశంలో అక్రమంగా ఉన్న పాకిస్తానీయులను దేశం నుంచి పంపించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలేకి విజేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పోంశెట్టి రాకేష్, కార్యదర్శి పత్తి పాక శ్రీనివాస్, సీనియర్ నాయకులు హనుమయచారి, యువమోర్చ మండల అధ్యక్షులు మోత్కుపల్లి రాజశేఖర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు చింతకుంట సాగర్, మండల ప్రధాన కార్యదర్శి తీపిరెడ్డి మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: రాష్ట్రంలో నివసిస్తున్న పాకిస్తానీయులను భారత్ నుంచి పంపాలని పేర్కొంటూ బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కాలె నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఇక్కడ బొంగాని అశోక్, రాజూరి కిరణ్, గంగాధర్‌చారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, మెరుపుల గంగాధర్, గంగిపెల్లి స్వామికుమార్, బ్రహ్మప్రసాద్, రాజు, అనీల్, తిరుపతి, చంద్రయ్య తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: దేశంలో నివసిస్తున్న పాకిస్తానీయులను తక్షణమే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వెంటనే పంపించాలని బీజేపీ నాయకులు కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసిన అనంతరం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందించారు. ఇక్కడ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, నంది నరేశ్, సల్ల సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ మాట్లాడారు. ఇక్కడ బీజేపీ సిరిసిల్ల కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, బాద నరేశ్, మహేందర్, రమేశ్‌రెడ్డి, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలి

• బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా సన్నవడ్లు కొనుగోలు చేయలేదని ఆరోపించారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో ధాన్యం కొనుగోలు జరగట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్ల జాప్యంతో ఇప్పటికే 50 శాతం మంది రైతులు ప్రైవేటు వాళ్లకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్నరకం ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలపాలన్నారు. బీఆర్ఎస్ హయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి వారి ఖాతాలో డబ్బులు జమ చేశామని, ప్రస్తుతం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, టౌన్ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, వరస కృష్ణహరి, గుండారపు కృష్ణారెడ్డి, వెంగళ శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, మాట్ల మధు, గుండు ప్రేమ్‌కుమార్, ఇమ్మనేని అమర్నాథ్, బండి జగన్, ఒగ్గు బాల్‌లింగం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి ఉత్సవాలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈనెల 13 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. 6న విష్ణు సహస్రనామ పారాయణం, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, పుట్ట మన్ను తేవడానికి పోవడం, అంకురార్పణ, 7న సుప్రభాతం, మంగల ధ్వని, అఖండ దీపారాధన, యాగశాల ద్వార తోరణ పూజ, పల్లకి సేవ, ధ్వజారోహణం, అగ్నిముఖం, 8న ఎదుర్కోలు, అశ్వవాహన సేవ, స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, 9న యాగశాల ప్రవేశం, శేష వాహన సేవ, 10న గజవాహన సేవ, 11న శ్రీ లక్ష్మీనరసింహ సుదర్శన హోమం, హనుమత్ వాహన సేవ, 12న గరుడసేవోత్సవం, 13న స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగపురి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మండల వనరుల కేంద్రం ఎదుట స్వీపర్ల ధర్నా

ముస్తాబాద్: పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ మండల వనరుల కేంద్రం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్వీపర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్వీపర్స్ అండ్ స్కావెంజర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ పదినెలల వేతనాలకు ఒక నెల వేతనం మాత్రమే ఇప్పటివరకు చెల్లించారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంజుల, లత, సునీత, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

సిరిసిల్లటౌన్/వేములవాడ/ఇల్లంతకుంట/రుద్రంగి: జిల్లా కేంద్రం సిరిసిల్లలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్‌లైన్లు తెగిపడగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెస్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. పొద్దటి నుంచి రాత్రి వరకు అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనానికి వర్షంతో ఉపశమనం కలిగింది. జిల్లాలోని పలు మండలాల్లో సైతం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. పలుచోట్లలో రాళ్లవానలు పడ్డాయి. వేములవాడలో భారీ వర్షం కురిసింది. గంటన్నరుపైగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం భూకంపం, రాత్రి భారీ వర్షంతో అతలాకుతలంగా మారిన వాతావరణంలో వేములవాడ ప్రాంతవాసులు ఆందోళనకు గురయ్యారు. కల్లాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి, రుద్రంగి మండలాల్లో భారీ వర్షం కురిసింది.

• క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పల్లెప్రకృతి వనంలో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత వాలీబాల్ క్రీడా శిబిరాన్ని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ పీడీ గుండాడి లింగారెడ్డి అన్నారు. క్రీడాశిబిరాన్ని లింగారెడ్డి సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలపై ఆసక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు బాపురెడ్డి, దేవరాజు, బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

• అదర్శరెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ అదర్శ రెడ్డి సంఘం సభ్యులు సోమవారం సమావేశమై సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అనుపట్ల రవీందర్ రెడ్డి, కోశాధికారిగా కట్ట శ్రీకాంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా చల్ల ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తడక

సంక్షిప్త వార్తలు

మల్ల రాజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆళ్ల జగపతి రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వినయ్, వెంకటరెడ్డి, మండల అడహక్ మెంబర్‌గా మాందాటి కరుణాకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

• రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన రాజు వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తుండగా వేములవాడ నందికమాన్ ప్రాంతంలో బైక్ బస్సును ఢీకొట్టగా రాజుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి, అనంతరం కరీంనగర్‌కు ఆస్పత్రికి తరలించినట్లు కోరారు.

• నివాళి

వేములవాడ: హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని మృతిపట్ల వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ హాల్‌లో సోమవారం న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఏజీపీ బొడ్డు ప్రశాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమలగౌడ్, పొత్తూరు అనిల్, గుడిసె సదానందం, వేముల సుధాకర్‌రెడ్డి, విద్యాసాగర్ రావు, కిషోర్‌రావు, కటకం జనార్దన్, నక్క దివాకర్, పంపరి శంకరయ్య, మనోహర్ తదితరులున్నారు.

సిరిసిల్లకల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించి ప్రస్తుతం హైకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించిన జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో కార్యకలాపాలన్నీ రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లాలో కోర్టు పనులన్నీ నిలిచిపోయాయి. ఆమె ఆత్మ శాంతికోసం న్యాయవాదుల సంఘం సోమవారం సంతాపం తెలిపారు. కోర్టు సమయానికి ముందే బార్ అసోసియేషన్ హాల్‌లో హాజరైన న్యాయవాదులు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

• విద్యార్థినికి అభినందన

ఎల్లారెడ్డిపేట: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించిన ఒగ్గు శ్రీనిధి అనే విద్యార్థిని ప్రముఖ ఎన్నారై రాధారపు సత్యం సోమవారం అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజు నర్సాగౌడ్, తిరుపతి, సల్మాన్ తదితరులు ఉన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కరించుకోవాలి



రుద్రంగి: భూభారతి పోర్టల్‌లో రైతులు తమ భూసమస్యలపై దరఖాస్తు చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని వేములవాడ ఇన్‌చార్జ్ ఆర్డీవో రాధా బాయి పేర్కొన్నారు. సోమవారం రుద్రంగి తహసీలల్దార్ శ్రీలతతో కలిసి రుద్రంగి గ్రామపంచాయతీ, మానాలలో భూ భారతి భూ సమస్యల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి రెడ్డి సంఘం , కరీంనగర్ మెడికవర్ ఆధ్వర్యంలో సోమవారం మండెపల్లిలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్‌సాయి చరణ్ 200 మంది గ్రామస్తులకు వివిధ పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ సెంట్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, శ్రీకాంత్, రెడ్డి సంఘం సభ్యులు రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల విద్యార్థులతో మండలంలోని తడగొండలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం శిబిరంలో భాగంగా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. బోయినపల్లి పీహెచ్‌సీ వైద్యులు గ్రామంలో వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా సాధికారితపై నాటక ప్రదర్శన చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తిక్, ఏఎన్ఎం వసంత, ఎస్ఎస్ఎస్ అధికారులు అరుణ్ బాబు, మాధవి, సహాయ అధ్యాపకులు హిందూజ, ఆదర్శ రైతు శ్రీనివాసరెడ్డి విద్యార్థులు ఉన్నారు.

‘ఉపాధిహామీ సామాజిక తనిఖీ’

వీర్నపల్లి: మండలంలోని ఉపాధిహామీ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన నాలుగో విడత సామాజిక తనిఖీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 2024–2025 సంవత్సరంలో రూ. 7కోట్ల 6లక్షలతో పనులు జరిగాయన్నారు. మంగళవారం నుంచి గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారి రామారావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అరుణ్‌కుమార్, తదితరులున్నారు.

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిపేటలో ఏక్తాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: కరీంనగర్‌లో ఈనెల 22న నిర్వహించే హిందూ ఏక్తాయాత్రకు లక్షలాది మంది ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్లక్రాంతికుమార్ కోరారు. మండల కేంద్రంలో ఏక్తాయాత్ర పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ హిందులందరినీ ఏకంచేసే యాత్రకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ వస్తున్నారన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాధ నరేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కుడుకల జనార్దన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బుచ్చెల్లి మహేశ్వరి, మాజీ ఎంపీటీసీ కామిటి కారి పద్మ, వరి వెంకటేశ్, స్వామి, లింగారెడ్డి, భగత్, శ్రీకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈనెల 22న నిర్వహించనున్న హిందూయాత్రకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చి హిందువుల ఐక్యతను చాటాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాత్రను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. నాయకులు నంది నరేష్, ప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, గాల్‌రెడ్డి, కంచర్ల పర్శరాములు, కిరణ్‌నాయక్, యాదగిరి, వంగల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బీజేపీ మండల కార్యాలయంలో నాయకులు హిందూ ఏక్తాయాత్ర ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మామిడి హరీశ్, నాగసముద్రాల సంతోష్, మేకల మల్లేశం, వజ్జెపల్లి శ్రీకాంత్, ముత్తక్క, తదితరులు పాల్గొన్నారు.

రాణా.. హరితవనం



మొక్కలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్ గౌడ్

ఇల్లంతకుంట: శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పోలీసులు మొక్కలను సంరక్షిస్తున్నారు. ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడెకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పండ్లతోటల పెంపకానికి జూలై 2024లో శ్రీకారం చుట్టారు. ఇల్లంతకుంట చివరన ఉన్న పోరంబోకు స్థలంలో ఆరెకరాల్లో 1972లో పోలీస్‌స్టేషన్ నిర్మించారు. క్వార్టర్లు కూడా నిర్మించారు. మిగిలిన భూమిచుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. ఎస్సై కదిర శ్రీకాంత్ గౌడ్ గజ్వేల్ ప్రాంతంలోని నర్సరీ నుంచి 300 పండ్ల మొక్కలు జామ, ఉసిరి, మామిడి, సపోట, నిమ్మకు సంబంధించినవి తెప్పించి మూడెకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జూలై 2024లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కల సంరక్షణ బాధ్యత స్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుల్‌తో పాటు హోంగార్డుకు బాధ్యత అప్పగించారు. పలు గ్రామాల్లోని ట్యాంకర్లతో రెండ్రోజులకోసారి మొక్కలకు నీరందించారు. మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీరందించేందుకు ఎస్పీ మహేశ్ బి గీతేతో కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడెకరాల్లో పండ్ల మొక్కలు పెంచడం రాష్ట్రంలోనే ఎక్కడా లేదని మండల ప్రజలు భావిస్తున్నారు. తోట మధ్యలో వాలీబాల్ కోర్ట్ ఆకట్టుకుంటోంది. నిత్యం హడావుడిగా విధులు నిర్వహించే పోలీసులు మొక్కలను సంరక్షించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

మూడెకరాల్లో పండ్ల మొక్కలు

స్టేషన్ ఆవరణలో మూడెకరాల స్థలం ఖాళీగా ఉన్నందున పండ్ల మొక్కలు నాటాలని భావించి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్యక్రమం చేపట్టాం. హెడ్ కానిస్టేబుల్‌తో పాటు హోంగార్డు నిత్యం తోటను పర్యవేక్షిస్తారు. తోటకు డ్రిప్ ఏర్పాటు చేయించాం. మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి.

– కదిరే శ్రీకాంత్ గౌడ్, ఎస్సై, ఇల్లంతకుంట

దరఖాస్తుల ఆహ్వానం

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, జూనియర్ కలాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ ఒక ప్రకటలో తెలిపారు. ఈనెల నుంచి 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత నోటుబుక్స్, బాలికలకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం ఉన్నట్లు తెలిపారు.

దీక్ష విరమించిన స్వర్ణకారులు



స్వర్ణకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: కులవృత్తులను కాపాడాలంటూ ముస్తాబాద్‌లో 12 రోజులుగా దీక్షలు చేస్తున్న స్వర్ణకారులు సోమవారం విరమించారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతోపాటు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య మాట్లాడుతూ ముస్తాబాద్‌లో కార్పొరేట్ జ్యువెల్లరీకి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. రాజస్థాన్‌కు చెందిన కొందరు వ్యాపారులు మండల కేంద్రాల్లో దుకాణాలు పెడుతూ అధిక అద్దెలు, అడ్వాన్స్‌లు చెల్లిస్తూ ఇక్కడి వారి ఉపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. స్వర్ణకారుల సంఘం నాయకులు చింతోజు శ్రీను, బ్రహ్మం, ఈశ్వరయ్య, రఘు, అనిల్, విశ్వనాథం, వెంకటేశ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం : కేకే మహేందర్‌రెడ్డి

ప్రభుత్వం స్వర్ణకారులకు అండగా ఉంటుందని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో స్వర్ణకారులు పన్నెండు రోజులుగా మండుతున్న ఎండల్లో చేపట్టిన దీక్షలు కలిచివేశాయన్నారు. తనపై నమ్మకంతో దీక్షలు విరమించిన వారికి అండగా ఉంటామన్నారు. ఏఎంసీ చైర్మన్ తలారి నర్సింలు, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, శ్రీనివాస్, భాను, ప్రశాంత్, నరేశ్, బాల్‌రెడ్డి, నర్సింలు, రాజు, షాదుల్, అంజనేయులు, నవీన్, దేవిరెడ్డి తదితరులున్నారు.

పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న పరిశీలకులు

ఎల్లారెడ్డిపేట: పార్టీ నిర్మాణంతోపాటు కార్యకర్తలను కాపాడుకుంటామని పీసీసీ పరిశీలకులు ఖాజా ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అధ్యక్షతన సోమవారం మూడు మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పరిశీలకులు మాట్లాడుతూ పార్టీ గ్రామాధ్యక్షులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో పార్టీ కార్యకర్తలను కలిసి గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలాధ్యక్ష పదవికి కనీసం ఐదు పేర్లకు తగ్గకుండా ఇవ్వాలని కోరారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి కూడా సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, ఎండీ హమీద్, భూత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రాములునాయక్, కొమిరిశెట్టి విజయ ఎస్‌కే సాబేరాబేగం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, జిల్లా నాయకులు షేక్ గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట: అక్రమంగా తనపై పోలీసు కేసు పెట్టారని ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. బాధితుల వివరాల ప్రకారం... మండలకేంద్రంలోని బాల్సాని ఆశాలు గౌడ్ (86) తన దుకాణంలో ఉండగా కొనుగోలుదారితో గొడవ జరిగింది. దీంతో ఆశాలుపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆశాలును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా మధ్యవర్తి ప్రమేయంతో వదిలిపెట్టారు. తిరిగి అదేరోజు సాయంత్రం మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు రావాలని తెలపడంతో ఇంటి బాత్రూంలోని క్లీనర్ డొమెక్స్ తాగాడు. కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అనంతరం ఇంటివద్ద ఉన్నాడు. ఇది చిన్న కేసని పరిశీలనలో ఉందని ఎస్సై కే శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

పెద్దమ్మ జాతర ప్రారంభం

ఇల్లంతకుంట: వంతడుపులలో సోమవారం పెద్దమ్మతల్లి జాతర ఘనంగా ప్రారంభమైంది. మంగళవారం పెద్దమ్మ బోనాలు, బుధవారం పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణ మహోత్సవ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.